క్లుప్తంగా

దీన్ని ప్రారంభించరా..



నిర్మాణం పూర్తయిన బెలగాం అర్బన్ హెల్త్ సెంటర్

పార్వతీపురం టౌన్: గత ప్రభుత్వంలో రూ.84 లక్షల అంచనా వ్యయంతో పార్వతీపురం పట్టణంలో బెలగాం అర్బన్ హెల్త్ సెంటర్‌ను పూర్తి చేశారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం 100 రోజులు గడుస్తున్న ఈ భవనాన్ని ప్రారంభించకుండా వదిలేసింది. పట్టణ ప్రజల ఆరోగ్య అవసరాలు నిమిత్తం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకు రాకపోవడంతో పట్టణంలో చర్చ సాగుతోంది. ఈ భవనాన్ని ప్రజా అవసరాల నిమిత్తం ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: పేదోడికి కడుపు నిండా అన్నం పెట్టడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి ఆయన శనివారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 6 పథకాల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్‌లను రాష్ట్ర వ్యాప్తంగా పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారని అన్నారు. ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురంలో 'ఇది మంచి ప్రభుత్వం'



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ: మండలంలో కోన పంచాయతీ గోపాలపురం గ్రామంలో ఎంపీడీఓ సిహెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరై గ్రామంలోని కొంతమంది లబ్ధిదారులు ఇంటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకుందన్నారు. వంద రోజుల్లో అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహాలక్ష్మి, డీఎఫ్ఓ ప్రసూన, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి పట్టివేత

సీతానగరం: మండలంలోని పెదంకలాంలో అక్రమంగా నిల్వ ఉన్న మందుగుండు సామగ్రిని శనివారం గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. పెదంకలాంలో మందుగుండు సామగ్రి అక్రమంగా నిల్వ ఉంచినట్టు వచ్చిన సమాచారంతో సిబ్బందితో దాడులు చేసినట్టు చెప్పారు. ఈ సమయంలో జి.పోలీసు, ఎం.కృపాలకు చెందిన స్థలాల్లో అక్రమంగా బస్తాలతో మందుగుండు తయారీ సామగ్రి ఉండగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా ఎవరైనా ఎటువంటి అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రిని నిల్వ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ అంకిత మహవీర్

• ఎస్‌డీపీఓ సురాన అంకిత మహవీర్

పార్వతీపురం టౌన్: యువత సైబర్ నేరాల పట్ల అవగాహన కల్గి ఉండాలని పార్వతీపురం ఎస్‌డీపీఓ సురాన అంకిత మహవీర్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై పట్టణంలో గాయత్రి డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల, మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాల కోసం, రోడ్డు భద్రతా నియమాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. ప్రస్తుత ప్రపంచంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడానికి ఫేక్ లోన్ యాప్‌ల ద్వారా, సామాజిక మాధ్యమాలలో లింక్‌లను పంపి ఇన్వెస్ట్మెంట్ చేయాలని నమ్మించడం, ఆన్‌లైన్‌లో జాబ్స్ ద్వారా, వర్క్ ఫ్రం హోం అంటూ ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చు అంటూ వివిధ రకాలుగా మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. యువత జాగ్రత్తగా ఉండి చుట్టుపక్కల వారిని కూడా జాగ్రత్తపరచాలని సూచించారు. త్వరగా డబ్బు సంపాదించుకోవాలనే అత్యాశకు వెళ్లి మోసపోవద్దన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు తలెత్తుతాయని, గంజాయి వాడకం వల్ల నేరాలకు పాల్పడి జీవితం నాశనం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకం, వినియోగం గురించి ఎటువంటి సమాచారం వున్నా దగ్గరలో వున్న పోలీస్‌స్టేషన్‌లో లేదా 1972కుగాని, 100కు సమాచారం అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ మణికుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీటీజీ విద్యార్థినికి ఆర్థిక సాయం



సోనియాకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న కురుపాం మండలం చింతమానుగూడ గ్రామానికి చెందిన మండంగి సోనియా అనే విద్యార్థినికి ఐటీడీఏ నుండి రూ.50వేల చెక్కును కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తన కార్యాలయంలో శనివారం అందజేశారు. సోనియా గత ఏడాది నీట్‌లో ర్యాంకును సాధించి రంగరాయ మెడికల్ కళాశాలలో ప్రవేశం పొందేందుకు ఆర్థిక సహాయం కోసం ఐటీడీఏ పీఓకు విన్నవించగా ఈ మేరకు మొదటి సంవత్సరానికి రూ.50వేలు అందించారు. అలాగే ఈ ఏడాది రెండవ సంవత్సరం ఫీజు, ఇతర అవసరాల కోసం ఐటీడీఏ నుండి రూ.50వేలు చెక్కును అందించినట్లు తెలిపారు. ఎంబీబీఎస్ కోర్సును పూర్తి చేసి నిపుణురాలైన వైద్యురాలిగా గుర్తింపు తెచ్చుకొని జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ, జేసీ ఎస్ఎస్.శోభిక ఉన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



కౌన్సిలర్ శంకరరావును పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు:

విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాలూరు మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ తాడ్డి శంకరరావును మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పరామర్శించారు. శనివారం విశాఖపట్నంలోని ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలి



జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వాగ్దేవికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

పార్వతీపురం టౌన్: వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు అందజేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. జిల్లా ఆస్పత్రి వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి గేటు వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 3 నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ఆస్పత్రికి వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలిగించకుండా పనులకు ఆటంకాలు కలిగించకుండా శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయమని అన్నారు. జీఓ వున్నప్పటికీ శ్రమకు తగిన జీతం ఇవ్వకపోగా ప్రతి నెలా జీతాలు సకాలంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. డిమాండ్లు పరిష్కారం చేయకపోతే పార్వతీపురంలో సెప్టెంబర్ 30న సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వాగ్దేవికి, ఆర్ఎంఓ శ్యామలకు సమ్మె నోటీసు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, సింహాద్రి దుర్గారావు, అలజంగి కుమారమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛత హి సేవ'



సీతానగరం: లచ్చయ్యపేట క్లాప్ మిత్రలకు గ్లౌజులు, టోపీలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

సీతానగరం:

స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కలు నాటారు. లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో క్లాప్ మిత్రలకు పంచాయతీ కార్యదర్శి మురళి గ్లౌజులు, టోపీలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ జే.తేరేజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిడగల్లు, సూరంపేట, కాశీపేట, గుచ్చిమి, అంటిపేట, పనుకుపేట తదితర గ్రామాల్లో స్వచ్ఛత హిసేవ కార్యక్రమాలు కార్యదర్శులు చేపట్టారు.

చాకరాపల్లిలో ర్యాలీ



పి.చాకరాపల్లిలో ర్యాలీ చేస్తున్న సర్పంచ్, సిబ్బంది

బలిజిపేట: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పి.చాకరాపల్లిలో సర్పంచ్ కె.మోహనరావు ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలి



డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

పార్వతీపురం టౌన్: పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటాను కుదిస్తూ జారీ చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో పీహెచ్‌సీ డాక్టర్లతో కలసి శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వైద్యులకు అలవెన్సు ఇవ్వాలన్నారు. జీఓ 85 రద్దుపై స్పష్టత వచ్చే వరకూ నిరసనలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

అగ్ని అస్త్రం తయారీపై అవగాహన



బర్లిలో పురుగుల నివారణకు అగ్ని అస్త్రం తయారు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: బర్లిలో ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు ఆధ్వర్యంలో పంటలో పురుగుల నివారణకు అగ్ని అస్త్రం కషాయం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. దీని వినియోగం వలన పచ్చపురుగు, కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు తదితర పెద్ద పురుగుల నివారణ జరుగుతుందని తెలిపారు. దీని తయారీకి గోమూత్రం, పచ్చి మిరపకాయలు, వెల్లుల్లి, పొగాకు గుండ, వేపాకు, జిల్లేడు ఆకులు అవసరం అవుతాయన్నారు. ఆకులను ముద్దగా నూరి గోమూత్రంలో వేసి మూడు పొంగులు వచ్చేవరకు మరిగించాలన్నారు. దీనిని 48గంటలు నిల్వ ఉంచిన తరువాత కషాయం తయారవుతుందని తెలిపారు. కషాయాన్ని వడగట్టి ఎకరాకు 6నుండి 8లీటర్లు తగినంత నీటిలో కలిపి స్ప్రే చేయాలని సూచించారు. దీనివలన రైతులకు పెట్టుబడి తగ్గి నాణ్యమైన దిగుబడి వచ్చే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, గంగమ్మ, రైతులు పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



శిక్షణ తరగతులు పూర్తి చేసిన అనంతరం సిబ్బందితో అభ్యర్థులు

పార్వతీపురం టౌన్: యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ సదస్సు జిల్లా సమాఖ్య భవనంలో ఐదు రోజుల పాటు జరిగాయి. స్టార్ట్ యువర్ బిజినెస్ (ఎస్‌వైబీ)పై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అనేక రాయితీలను కల్పిస్తుందని చెప్పారు. పారిశ్రామికవేత్తలుగా అనేక మంది యువతీ యువకులకు ఉద్యోగ కల్పన చేయవచ్చని అందులో ఎంతో సంతృప్తి కలుగుతుందని ఆయన సూచించారు. ఒక క్రమశిక్షణ గల యజమానిగా పరిశ్రమలను చక్కగా నిర్వహించవచ్చని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు ముందు ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయడంలో మెలకువలు పాటించి అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఏపీఓ రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పరిశ్రమలకు కల్పిస్తున్న రాయితీలు, బ్యాంకు రుణాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది ఎం.కంచిబాబు, నాయుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

'భోజనం' పరిశీలించిన కలెక్టర్



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. విద్యార్థులతో సహా ఆహారాన్ని స్వీకరించారు. విద్యార్థులందరితో పంక్తిలో కూర్చుని ప్రార్థన చేసి అనంతరం ఆహారాన్ని స్వీకరించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని వదిలి వేయరాదని, చక్కని ఆరోగ్యానికి ఆహారం సహకరిస్తుందని ఆయన చెప్పారు. పౌష్టికాహారం పట్ల అవగాహన పెంచుకోవాలని, పౌష్టికాహారాన్ని ముఖ్యంగా బాలికలు విధిగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆహార పదార్థాలను వృథా చేయరాదని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను బాగా గ్రహించాలని అందుకు ఏకాగ్రత అవసరమని కలెక్టర్ అన్నారు. పాఠ్యాంశాలలో సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకొని చదవాలని ఆయన చెప్పారు. బాగా చదవడం వలన బంగారు భవిష్యత్తు పొందుతారని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గార పగడాలమ్మ, ఏఎంఓ వై.శంకర్, ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



లక్ష్మీపురంలో ఏఓ పర్యవేక్షణలో మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతు

సీతానగరం: వరి చేనులో ఆశించిన రసం పీల్చు పురుగులు నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు క్రిమి సంహారక మందులు వాడాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. లక్ష్మీపురం, వెంకటాపురంసూరంపేట గ్రామాల్లో వరి చేను పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వరిచేను పంటేపుగా పెరుగుతున్న సమయంలో ఆశించిన పీల్చుపురుగులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ముందుగా రసం పీల్చు పరుగులు ఉధృతిని తగ్గించడానికి యల్లోస్టికీ కార్డ్స్ ఉపయోగించాలని తరువాత రసాయనాలు వాడాలని సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్ఎఫ్) శాఖ ఆధ్వర్యంలో ఎల్లోస్టికీ కార్డ్స్ రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. రసాయనాలు వినియోగించే ముందు వరిచేనులో తెగుళ్లను వ్యవసాయ సిబ్బంది పరిశీలించిన తరువాతనే మందు ద్రావణాన్ని పిచికారీ చేయించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



బలిజిపేట: పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

తెలుగు వెలుగు 'గురజాడ'



గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్నేహకళా సాహితీ సభ్యులు

పార్వతీపురం టౌన్:

తెలుగు భాషకు వెలుగు జాడ అయిన గురజాడ వెంకట అప్పారావు జయంతి సందర్భంగా పార్వతీపురానికి చెందిన స్నేహకళా సాహితి సభ్యులు ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి కూడలిలో ఉన్న కవి శేఖరుని విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన రచన వైశిష్ట్యం ప్రసంగించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

గురజాడ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

గురజాడ వెంకట అప్పారావు జయంతి సందర్భంగా ఎమ్మెల్యే జోనెల విజయ చంద్ర పట్టణంలో గల గురజాడ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన కృషి ఏనలేనిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: గురజాడ జయంతి వేడుకను పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద శనివారం నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ గురజాడ రచించిన కన్యాశుల్కంకు ఎంతో ఆదరణ లభించిందన్నారు. గురజాడ ఎంతో గొప్ప రచయిత అని తెలిపారు. అటువంటి మహానుభావుని స్మరించుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జి.శ్రావణ్‌కుమార్, ఎన్.నవీన్, బి.వెంకటరమణ, సిహెచ్.శ్రీనివాసరావు, కె.గౌరీనాథ్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ ఆదర్శప్రాయుడు

సాలూరు: గురజాడ అప్పారావు ఆదర్శప్రాయుడని వెంకటవిద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయిశ్రీనివాసరావు అన్నారు. శనివారం పాఠశాలలో గురజాడ జయంతిని నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.